


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ   సంపుటి : 01   సంచిక : 74   గురువారం 13 ఆగష్టు 2026   పేజీలు : 8   వెల : 2/-

## మూడోసారి అధ్యక్ష పోటీకి సై.. కానీ రాజ్యాంగం అడ్డొస్తోంది: డొనాల్డ్ ట్రంప్

- మూడోసారి అధ్యక్ష పదవి చేపట్టడం పై ట్రంప్ ఆసక్తి
- రాజ్యాంగ నిబంధనలు కఠినంగా ఉన్నాయని వ్యాఖ్య
- తనకు ప్రాణహాని ఉందంటూ సంచలన వ్యాఖ్యలు
- హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని స్పష్టీకరణ
- అమెరికా ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని వెల్లడి



2

## జెన్-జీకి ప్రధాని నరేంద్ర మోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు



2

## ఆత్మకూరు అటవీ డివిజన్లో.. ఎఫ్ఎస్ఓ పై సస్పెన్షన్ వేటు



- ఇంద్రేశ్వరం బేస్ క్యాంపులో ప్రొటెక్షన్ వాచర్ల తొలగింపు
- పెద్దపులి మృతి చెందిన విషయం ఉన్నతాధికారులకు తెలపనందుకు ఐ చర్యలు
- వన్యప్రాణుల సంరక్షణలో ఉద్యోగుల పాత్ర కీలకం
- పర్యావరణం పరిరక్షణ పై ఉద్యోగులందరూ కలిసికట్టుగా పని చేయాలి
- అతి త్వరలోనే అటవీశాఖ సిబ్బందిని ప్రక్షాళన చేస్తా
- ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ ఆపావో

## 17 రోజుల్లో 50 లక్షల ఇళ్ల సందర్శన.. శ్రేణులకు లోకేశ్ అభినందనలు

- 17వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం
- రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజలకు వివరిస్తున్న నేతలు
- టీడీపీ శ్రేణులను అభినందించిన నారా లోకేశ్
- పనితీరు నెమ్మదిగా ఉన్న నియోజకవర్గాల పై ప్రత్యేక సమీక్ష




## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు: కేటీఆర్

- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడి పై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్



2

## ఓటర్ల జాబితా సవరణ పై ఆందోళన




2

- లక్షలాది మంది డేటాలో వైరుధ్యాలు
- ముసాయిదాలో పేరు లేకపోయినా భయం వద్దన్న సీఈవో సుదర్శన్ రెడ్డి
- అన్‌మ్యాప్డ్, అనామలీ ఓటర్లకు నోటీసులు
- ఆగస్టు 17న ముసాయిదా, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాద పూర్వకంగా కలిసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల ఆగస్టు 10 వార్త సాక్ష్యం

న్యూ ఢిల్లీలోని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి కార్యాలయంలో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించారు. నంద్యాల జిల్లా ప్రజల భద్రత, సౌకర్యం, మెరుగైన రవాణా కనెక్టివిటీకి సంబంధించిన పలు ముఖ్యమైన అభ్యర్థనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 13 ఆగష్టు 2026

## జెన్-జీకి ప్రధాని నరేంద్ర మోదీ కీలక సూచన

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## మూడోసారి అధ్యక్ష పోటీకి సై.. కానీ రాజ్యాంగం అడ్డొస్తోంది: డొనాల్డ్ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వ్యాఖ్యలతో అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యారు. 2028లో మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి తనకు ఉన్నప్పటికీ, దేశ రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డంకిగా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల తన మద్దతుదారులు సభల్లో 'ట్రంప్ 2028' అంటూ నినాదాలు చేస్తున్న తరుణంలో, వాషింగ్టన్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు స్పందించారు. "ప్రతీ ఒక్కరూ నన్ను ఇదే అడుగుతున్నారు. సభల్లో '2028' అంటూ నినాదాలు చేస్తున్నారు. నిజానికి నాకు మళ్లీ పోటీ చేయాలని ఉంది. కానీ, ఈ విషయంలో అమెరికా రాజ్యాంగ చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం, ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశం లేదు. 2016, 2024 ఎన్నికల్లో గెలిచిన ట్రంప్‌కు ఇది రెండో పర్యాయం కావడం గమనార్హం. ఇదే సమయంలో, తన భద్రత, ప్రాణహానిపై కూడా ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "దేశానికి మేలు చేసే ఏ ప్రభావవంతమైన అధ్యక్షుడికైనా బెదిరింపులు రావడం సహజం. ఏమీ చేయని నాయకులను ఎవరూ పట్టించుకోరు. నాకు బయటకు తెలియని ఎన్నో బెదిరింపులు వస్తుంటాయి" అని ఆయన అన్నారు. ఇటీవల తన టర్కీ పర్యటన సందర్భంగా సీక్రెట్ సర్వీస్, సైనిక బృందాలు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయని గుర్తుచేశారు. అంతేకాకుండా, ఇరాన్‌పై మాట్లాడుతూ వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి పూర్తిగా అమెరికా నౌకాదళం నియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. తాను ఇరాన్‌ను ఎంతమాత్రం నమ్మబోనని తేల్చిచెప్పిన ఆయన, అమెరికాలో స్టాక్ మార్కెట్లు రికార్డులు సృష్టిస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థ చాలా బలంగా ఉందని పేర్కొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల రూమ్ చార్జీల పై పార్లమెంటరీ కమిటీ సిఫార్సు

దేశంలోని మెట్రో నగరాల్లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3-స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టం చేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి, రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. 'ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు-స్తోమత' పేరిట రూపొందించిన ఈ నివేదికను ఆగస్టు 7న పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈ నిబంధన కేవలం ప్రాథమిక గది అద్దెకే వర్తిస్తుందని, రెసిడెంట్ డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ. 6,631గా ఉండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో అది రూ. 50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు, ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ. 6,000 నుంచి రూ. 12,000 వరకు ఉండగా, సమీపంలోని 3-స్టార్ హోటళ్లలో అది రూ. 2,500 నుంచి రూ. 4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికి ముందే అంచనా వ్యయాన్ని రోగులకు వివరించాలని సూచించింది. అయితే, హోటళ్లతో ఆసుపత్రులను పోల్చడం సరికాదని, ఆసుపత్రుల్లోని వైద్య సేవలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు హోటళ్లతో పోలిస్తే భిన్నంగా ఉంటాయని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు అభిప్రాయపడ్డాయి. ప్రస్తుతం ఇవి సలహా పూర్వక సిఫార్సులు మాత్రమే కాగా, వీటి అమలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

# 17 రోజుల్లో 50 లక్షల ఇళ్ల సందర్శన.. శ్రేణులకు లోకేశ్ అభినందనలు

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం, కేవలం 17 రోజుల్లోనే 50 లక్షల ఇళ్ల సందర్శన మార్క్‌ను దాటింది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు నేరుగా చేరవేసే లక్ష్యంతో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి 17 రోజులు పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ శ్రేణులు మొత్తం 50.62 లక్షల ఇళ్లను సందర్శించాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు సగటున ప్రతిరోజూ మూడు లక్షలకు పైగా కుటుంబాలను కలుస్తున్నారు. 17వ రోజైన మంగళవారం ఒక్కరోజే 3.12 లక్షల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయాలు, స్థానిక సమస్యలను కూడా స్వీకరించి, వాటిని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. 50 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించడంపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఇంత భారీ స్థాయిలో ప్రజలతో మమేకమవుతున్న నాయకులు, కార్యకర్తల కృషిని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, కార్యక్రమం నెమ్మదిగా సాగుతున్న నియోజకవర్గాల పై ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. 25 వేల కంటే తక్కువ సందర్శనలు నమోదైన నియోజకవర్గాలు, సుమారు 4,220 బూత్‌ల పనితీరును పరిశీలించినట్లు సమాచారం. 50 లక్షల మైలురాయి స్ఫూర్తితో కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని లోకేశ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# ఆత్మకూరు అటవీ డివిజన్లో.. ఎఫ్‌ఎస్‌ఓ పై సస్పెన్షన్ వేటు

ఆత్మకూరు ఆగస్టు 12 వార్త సాక్ష్యం




గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఓ పెద్దపులి ఉచ్చులో పడి మృతిచెందిన సంఘటనను ఉన్నతాధికారులకు తెలియకుండా దాచిపెట్టిన ఎఫ్ ఎస్ ఓ మహబూబ్ బాషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు ఈ కేసులో మరో 7 మంది ప్రొటెక్షన్ వాచర్లను తొలగించినట్లు ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో బుధవారం విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తూ పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణలో, నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు 2025 సెప్టెంబర్ నెలలో నాగులుటి రేంజ్ ఇంద్రేశ్వరం సెక్షన్ పరిధిలో అమలాపురం డొంకు వాగులో ఓ పులికి కుచ్చులో పడి మృతిచెందిన సంఘటనను రహస్యంగా ఎఫ్ఎస్ఓ మహబూబ్ బాషా, ప్రొటెక్షన్ వాచర్లు ఆ పులిని, దహనం చేసిన సంఘటనపై, ఆలస్యంగా వెలుగు లోకి రావడంతో అటవీ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాలతో మహబూబ్ భాషను సస్పెండ్ చేసినట్లు తెలిపారు, పర్యావరణం పరిరక్షణ పై, అటవీశాఖ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని వివరించారు సిబ్బంది అందరూ విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వన్యప్రాణుల సంరక్షణ పర్యావరణం పై అధికారులు ముందుండాలని ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో తెలియజేశారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాద పూర్వకంగా కలిసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

న్యూ ఢిల్లీలోని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి కార్యాలయంలో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించారు. నంద్యాల జిల్లా ప్రజల భద్రత, సౌకర్యం, మెరుగైన రవాణా కనెక్టివిటీకి సంబంధించిన పలు ముఖ్యమైన అభ్యర్థనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బొల్లవరం, కరివేన, ఆత్మకూరు-సిద్ధపల్లె జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు, పారుమంచాల వద్ద మీడియన్ ఓపెనింగ్, డిపాల్ స్కూల్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, భానుముక్కల - ఇస్కాల గ్రామాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కోరానన్నారు. అలాగే ఎన్ హెచ్-340C (ఆత్మకూరు-దోర్నాల), ఎన్ హెచ్ -544D (బుగ్గ-కైప-గిద్దలూరు) రహదారులకు సంబంధించిన డిపిఆర్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు: కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారం పై సమగ్ర విచారణ జరపాలని, దీని పై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ పై ఆందోళన

తెలంగాణలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో తమ ఓటు హక్కు రద్దవుతుందేమోనని పౌరుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73 లక్షల మంది వివరాలు లభించకపోవడం, మరో 80 లక్షల మంది డేటాలో తప్పులు దొర్లడంతో ఈ గందరగోళం మొదలైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ముసాయిదా జాబితాలో పేరు లేనంత మాత్రాన ఓటు శాశ్వతంగా తొలగించినట్లు కాదని, అర్హులైన ప్రతి ఒక్కరూ సరైన ఆధారాలతో తిరిగి క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అధికారులు జారీ చేయనున్న నోటీసులపై సీఈవో స్పష్టత ఇచ్చారు. 2002 రికార్డులతో సరిపోలని వారిని 'అన్‌మ్యాప్డ్' కేటగిరీగా, పేర్లు, వయసు, చిరునామాలో తేడాలున్న వారిని 'అనామలీ' కేటగిరీగా గుర్తించారు. ఈ రెండు వర్గాల వారికి నోటీసులు జారీ అవుతాయని, వాటికి అనుగుణంగా సరైన ధ్రువపత్రాలు సమర్పించి వివరాలు సరిచేసుకోవాలని సూచించారు. ఒకవేళ జాబితాలో అసలు పేరే లేకపోతే ఫారం-6 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. దీనిపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించడానికి సెప్టెంబరు 15 వరకు గడువు ఉంటుంది. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అనంతరం, అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా మరణించిన వారు (9.22 లక్షలు), శాశ్వతంగా వలస వెళ్లిన వారు (45.18 లక్షలు), రెండు చోట్ల ఓట్లు ఉన్న వారి (6.70 లక్షలు) పేర్లను నిర్ధారించుకున్న తర్వాతే తొలగిస్తామన్నారు. అధికారులు పంపే నోటీసులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని సుదర్శన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# సంపాదకీయం

## 'వరి' వృద్ధికి కారణం 'కాళేశ్వరం' కాదు!



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2014లో సుమారు 47 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సాగు విస్తీర్ణం, 2025 నాటికి కోటి 20లక్షల ఎకరాలకు పెరిగింది. వరి సాగు విస్తరణ ద్వారా దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచినా, రైతుల ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, సహజ వనరుల నాణ్యత, లభ్యత గణనీయంగా క్షీణించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు, వరిలో నమోదైన ఈ గణనీయమైన వృద్ధి గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం వంటి నీటిపారుదల ప్రాజెక్టుల వల్లే సాధ్యమైందని కొన్ని రాజకీయ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే, వరి పెరుగుదలకు ఈ ప్రాజెక్టులతో సంబంధం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, గత పదేళ్లలో ఎకరాకు వరి దిగుబడిలో కూడా చెప్పుకోదగ్గ మార్పు కనిపించలేదు. మరి ఈ పరిస్థితుల్లో వరి ఉత్పత్తిలో నమోదైన ఈ గణనీయమైన వృద్ధికి అసలు కారణాలేమిటి?మొదటి కారణం: గత పదేళ్లలో మెరుగైన ఋతుపవనాల కారణంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవడం. 2016--17 నుంచి 2025--26 వరకు తెలంగాణలోనే కాకుండా యావత్ భారతదేశంలో కూడా మెరుగైన ఋతుపవనాల ప్రభావంతో సాధారణ సగటు కంటే అధిక వర్షపాతం నమోదైంది. దాంతో దేశవ్యాప్తంగా వరి విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరిగాయి. 2015--16లో దేశంలో సుమారు 11 కోట్ల ఎకరాల్లో ఉన్న వరి విస్తీర్ణం, 2025--26 నాటికి 14 కోట్ల ఎకరాలకు పెరిగింది. ఈ పెరుగుదలలో దాదాపు 77 లక్షల ఎకరాలు (అంటే సుమారు 25 శాతం) కేవలం తెలంగాణలోనే విస్తరించింది. తద్వారా తెలంగాణలో వరి ఉత్పత్తి కూడా ఇదే కాలంలో 78 లక్షల టన్నుల నుంచి 270 లక్షల టన్నులకు పెరిగింది. ఉత్పాదకత (ఎకరాకు దిగుబడి) పెరగడం వల్ల ఈ వృద్ధి నమోదు కాలేదు. తెలంగాణలో వరి ఉత్పత్తిలో నమోదైన గణనీయమైన పెరుగుదలకు ప్రధాన కారణం సాగు విస్తీర్ణం పెరగడమే తప్ప, ఉత్పాదకత హెచ్చడం కాదు.రెండో కారణం: గత దశాబ్దంలో తెలంగాణలో సగటు కంటే అధిక వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. ఈ అనుకూల పరిస్థితులు రైతుల్లో భూగర్భ జలాల లభ్యతపై విశ్వాసాన్ని పెంచి, కొత్త బోరు బావుల తవ్వకానికి ప్రోత్సాహాన్ని కల్పించాయి. 2014లో రాష్ట్రంలో సుమారు 16 లక్షల బోరు బావులు ఉండగా, 2023--24 నాటికి వాటి సంఖ్య 31 లక్షలకు చేరుకుంది. ఒక బోరు బావికి సుమారు రూ.2 లక్షల వ్యయమవుతుందని అంచనా. ఈ లెక్కన గత పదేళ్లలో రైతులు సొంత పెట్టుబడులతో అదనంగా ఏర్పాటుచేసిన బోరు బావులపై రూ.30 నుంచి రూ.35 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇది తెలంగాణ వ్యవసాయ చరిత్రలో రైతులు స్వయంగా చేసిన అతిపెద్ద మూలధన పెట్టుబడుల్లో ఒకటి. ఒక బోరు బావి సగటున 2--3 ఎకరాలకు సాగునీటిని అందిస్తుందని పరిగణిస్తే, కొత్తగా ఏర్పడిన 15 లక్షల బోరు బావుల ద్వారా అదనంగా సుమారు 35 నుంచి 40 లక్షల ఎకరాలలో సాగు పెరిగింది. ఈ అంచనాకు రాష్ట్ర నికర సాగునీటి విస్తీర్ణంలో నమోదైన పెరుగుదల కూడా బలాన్ని ఇస్తోంది. 2014 రాష్ట్ర నికర సాగునీటి విస్తీర్ణం 57 లక్షల ఎకరాలు కాగా, 2023--24 నాటికి అది 92 లక్షల ఎకరాలకు పెరిగింది. అంటే, గత పదేళ్లలో రాష్ట్రంలో అదనంగా పెరిగిన నికర సాగునీటి విస్తీర్ణంలో దాదాపు 100 శాతం వృద్ధికి బోరు బావుల విస్తరణే ప్రధాన కారణం. కొన్ని రాజకీయ వర్గాలు అదేపనిగా పేర్కొంటున్నట్లుగా గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత పదేళ్లలో సాగునీటి విస్తీర్ణం పెరిగిందనే వాదన పూర్తి అవాస్తవం. మూడో కారణం: ప్రభుత్వ వరి కేంద్రీకృత ధాన్య సేకరణ విధానం. సాగునీటి లభ్యత ఒక్కటే రైతు పంట ఎంపికను నిర్ణయించదు. గత ప్రభుత్వ హయాంలో అమలైన ధాన్య సేకరణ విధానం వరి కేంద్రీకృతంగా మారి, ఇతర పంటలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా రైతుల్లో వరి పండిస్తే ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేస్తుందనే బలమైన నమ్మకం ఏర్పడింది. ఇతర పంటలకు అదే స్థాయి మార్కెట్ భరోసా లేకపోవడంతో వాటి సాగుపై వారి ఆసక్తి పూర్తిగా తగ్గింది. దాంతో పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. వరి ఉత్పత్తి పెరిగినా, సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయ భద్రత, సహజ వనరుల పరిరక్షణ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం చూపే పరిస్థితులు ఏర్పడ్డాయి. నాలుగో కారణం: ఉత్పాదకతలో స్తబ్దత, సాగు వ్యయంలో పెరుగుదల. వరి సాగు విస్తీర్ణం పెరిగినా, ఉత్పాదకతలో మాత్రం అదే స్థాయి పురోగతి లేదు. 2014లో ఎకరానికి సగటున 20--22 క్వింటాళ్ల వరి దిగుబడి ఉంది. 2025 నాటికి కూడా వరి దిగుబడిలో ఎలాంటి మార్పూ లేదు. దీనికి విరుద్ధంగా, రాష్ట్రంలో రసాయన ఎరువుల ద్వారా పంట పోషకాల (నత్రజని, భాస్వరం, పొటాష్) వినియోగం 2014లో ఎకరానికి సగటున 80 కిలోలు ఉండగా, 2024--25 నాటికి 150 కిలోలకు పెరిగింది.

# మోదీ ఘటనా ఘటన సమర్థత ఏమైంది?

జూలై 20న దేశ రాజధానిలో విద్యార్థులపై పోలీసులు రకరకాల ఆయుధాలతో జరిపిన దాడులు సృష్టించిన గాయాల నుంచి చాలా మంది కోలుకునే ఉంటారు. అయితే అప్పటి నుంచీ పార్లమెంటు సమావేశాలు మాత్రం దాదాపు స్తంభించిపోయాయి. విద్యార్థులపై పోలీసు దాడులకు ఆదేశాలు ఎవరు జారీ చేశారో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు.

ఒకవైపు దేశ రాజధానిలో గత కొద్ది రోజులుగా ఎడతెరపి లేని వర్షాలు ప్రజాజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుండగా మరో వైపు పార్లమెంటులో నినాదాలు రాజకీయ వాతావరణాన్ని స్తంభింపచేస్తున్నాయి. 'పేపర్ చోర్, గద్దీ ఛోడ్' అని నిన్నటివరకూ నినదించిన ప్రతిపక్షాలు ఇప్పుడు 'అమిత్ షా జవాబ్ దో, చందాచోర్, గద్దీ ఛోడ్' అని అని నినాదాలు చేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మంగళవారం మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీతో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య పార్లమెంటు భద్రతా సిబ్బంది గోడలా నిలుచోవలసి వచ్చింది. ఈ రణగొణ ధ్వనుల మధ్య కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన వార్తలు కూడా కొట్టుకుపోయినట్లు కనిపిస్తోంది.

వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నవారు, మోదీ సర్కార్ అనుకున్న విధంగా డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా చేయగలుగుతుందని భావించినవారు ఇప్పుడు నిరాశ చెందే ఉంటారు. ఈ బిల్లులను ఆమోదిం పచేసేందుకు నరేంద్రమోదీ టీమ్ రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెచ్చిపోయిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్దవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఆయన మద్దతుదారులు ఉప్పొంగిపోయారు. మోదీకి దాసోహమై, ఆయన చర్యలకు భయభ్రాంతులై ఉన్న అనేక రాజకీయ పార్టీలు ఈ దేశంలో ఇక ఆయనకు తిరుగులేదని, ఆయన అడుగుజాడలను అనుసరించడం మినహా చేయగలిగేదేమీ లేదనే నిర్ధారణకు వచ్చారు.నిజానికి గత రెండేళ్ల నుంచీ అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్యలు విదేశీ విధానం విషయంలో మోదీని ఆత్మరక్షణలో పడవేస్తున్నాయి. గత రెండు నెలలుగా దేశ వ్యవహారాలలో సంభవించిన అనేక పరిణామాలు ఆయన కల్పించిన భయోపేత వాతావరణాన్ని తుత్తునియలు చేశాయి. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, పిల్లలు మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం మోదీ అజేయశక్తిని మొట్టమొదటసారి దెబ్బతీసింది. ఈ ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం దేన్నైనా లెక్కచేయని తత్వాన్ని మార్చుకునేలా చేసింది. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. రైతు ఉద్యమం మాదిరే ఈ ఉద్యమాన్ని కూడా అణిచివేస్తే సద్దుమణిగి పోతుందనుకున్నవారు కింకర్తవ్య విమూఢులయ్యారు. పరాన్న జీవులు, బొద్దింకలు అని విమర్శించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విద్యార్థుల కేసులు వినడం ప్రారంభించారు. తొలుత అతుల్ లిమాయే వంటి ఆర్‌ఎస్‌ఎస్ నేతలు విద్యార్థుల ఆందోళనను దేశద్రోహం క్రింద అభివర్ణించినా ఆ తర్వాత మోహన్ భాగవత్ ఆలస్యంగానైనా స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని సరిగా అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. 'పక్షులకు కూడా పొడిచే హక్కు ఉంది' అని ఆయన తాజాగా ప్రకటించారు. 'మనం వారి మాట వినాలి. వారితో మనం మాట్లాడలేకపోయాం. అందుకే వారు నిరసన తెలిపారు.' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా యువతను మెప్పించే విధంగా ఇన్‌స్టాగ్రామ్‌లు, రీల్స్ చేయడం మొదలుపెట్టారు.



మంత్రులు సైతం విద్యార్థుల పరిభాషలో డెలులూ, ఫోమో అంటూ మాట్లాడ ౕసాగారు. ఈ నెల 8న ఢిల్లీ ఐఐటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి ఆలోచన లేకుండా తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించాలని, నిజమైన పరిష్కారాల కోసం ధైర్యం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు చేసింది అదే కదా! వారే కనుక ప్రశ్నించే ధైర్యం చేయకపోతే ప్రశ్న పత్రాల లీక్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టేందుకు ఆగమేఘాలపై బిల్లును ప్రవేశపెట్టేవారే కాదు. ఈ నెలరోజుల సమావేశాల్లో పార్లమెంటులో చెప్పుకోదగినదేమైనా ఉన్నదంటే ఈ బిల్లు ఆమోదం పొందడం మాత్రమే. మన సనాతన ధర్మంలో ప్రశ్నకు అత్యంత విలువైన స్థానం ఉన్నదని బీజేపీ సిద్ధాంతకర్తలకు వేరే చెప్పనక్కర్లేదు. భగవద్గీత, ఉపనిషత్తులు ప్రశ్నకు ప్రాధాన్యమిచ్చాయి. సత్యాన్ని అన్వేషించే క్రమంలో ప్రశ్నించే స్వేచ్ఛకు, అన్వేషణకు ఇచ్చిన విలువ మన సంస్కృతిలో మరి దేనికీ లేదు. తాము తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అనైతిక పనులు, తాము కుప్పకూల్చిన వ్యవస్థలు, అవినీతి కార్యకలాపాలను ప్రశ్నించాలంటే భయపడే పరిస్థితి ఇంతకాలం ఎదురయింది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిలో కొద్దిగా మార్పు వస్తున్నట్లు కనపడుతోంది.

విద్యార్థుల ఆందోళన సద్దుమణిగిందో, లేక కొత్త ప్రాంతాల్లో తలెత్తుతుందో, లేక ఇతరేతర శక్తులకు ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పలేము కాని మోదీ విజృంభణ వల్ల దెబ్బతిన్న ప్రతిపక్షాలకు మాత్రం ఎక్కడలేని ఉత్సాహాన్ని కల్పించింది. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఘన విజయం, ఇండియా కూటమి పార్టీల్లో చీలిక, విభేదాల వల్ల దిక్కుతోచని స్థితిలో ఉన్న ప్రతిపక్షాలు ఊపిరి పీల్చుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్‌గాంధీ నిర్వహి ంచిన 'ఛాత్రోంకి ఘూంజ్'కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం కీలక పరిణామంగా భావించవచ్చు. రాబోయే ఎన్నికల్లో విద్యార్థులు సృష్టించిన మోదీ వ్యతిరేకతను తమకు అనుకూలంగా ఉపయోగించుకునేందుకు విపక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తాయనడంలో సందేహం లేదు. అందుకే పార్లమెంట్‌లో ఆద్యంతం వేడిని కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పుడా వేడి వీధుల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నది.

సున్నా కన్నా ఎంత ఎక్కువైనా కాంగ్రెస్‌కు మంచిదే. కాని శిఖరస్థాయికి చేరుకున్న బీజేపీకి మాత్రం పడిపోకుండా ఉండేందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఇప్పటి వరకూ తిరుగులేని నేతగా ఉన్న నరేంద్రమోదీకి విద్యార్థులు, ప్రతిపక్షాలు మాత్రమే సమస్య కాదు. పార్టీలోనూ, సంఘ్ లోనూ ఆయనకు అంతర్గత సమస్యలు లేకపోలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా ఆయన నియమించిన నితిన్ నబీన్ ఖాళీ చేసిన సీటులో పార్టీ ఓడిపోవడం సాధారణ విషయం కాదు. నిజానికి మోదీ కీలకమైన పదవుల్లో నియమించిన నేతల విషయంలో పార్టీలో అసంతృప్తి రగులుతూనే ఉన్నది. ఢిల్లీలో పార్టీ కార్యాలయంలో తిరుగుతూ, పార్టీ కార్యదర్శి స్థాయి నేత అపాయింట్‌మెంట్ కోసం కూడా గంటలతరబడి వేచి చూసిన రేఖాగుప్తాను ముఖ్యమంత్రిగా నియమిం చడంపై తీవ్ర అసంతృప్తి ఉన్నది. ఉజ్జయిని భూ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాతే మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఫలానా నేత ఉన్నారన్న విషయం ప్రపంచానికి తెలిసింది. అసోం, పశ్చిమబెంగాల్‌లో ఇతర పార్టీల నుంచి వచ్చి ముఖ్యమంత్రులైనవారి గురించి తప్ప బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనామక నేతల పేర్లు చెప్పేందుకు కష్టపడాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రుల సంగతి అటుంచితే ఇటీవల కేంద్రంలో ఇద్దరు మంత్రులు వివాదాస్పదులయ్యారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వల్ల ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వస్తే, పర్యావరణ మంత్రి భూపేంద్రయాదవ్ కార్యాల యంలో అనేకమందిని పీఎంఓ చెప్పాపెట్ట కుండా తొలగించింది. ఇందుకు ఏ అవినీతి కార్యకలాపాలు కార ణమో ఎవరూ చెప్పడం లేదు. గత ఆరునెల లుగా కేంద్రంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని, నితిన్ నబీన్ తన టీమ్‌ను ప్రకటిస్తారని పార్టీ నేతలే ప్రచారం చేస్తున్నప్పటికీ ఈ మార్పులు ఎప్పటికప్పుడు వాయిదాపడుతూనే ఉన్నాయి. ఈ మార్పులను పార్టీలో కొందరు ప్రతిఘటించినందువల్లే అవి ఆగిపోయాయని అంటున్నారు. ఏది ఏమైనా బీజేపీలో పరిస్థితులు అనుకున్నంత సవ్యంగా లేవని ఢిల్లీ అధికార నడవాలలో తిరిగే వారికి అర్థమవుతుంది. దీనికి తోడు అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ బీజేపీ నైతిక మూలాల్ని దెబ్బతీసిందనడంలో సందేహం లేదు.

ఇంతకీ మోదీ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ఎప్పుడు ప్రవేశపెడతారు? కేరళ, తమిళనాడు ఎన్నికల తర్వాత తెరపైకి వచ్చిన ఎఫ్‌సీఆర్ఐ బిల్లును ఆమోదింపచేయగలుగుతారా? రెండు రోజుల క్రితం అమెరికా ఉపాధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్ మోదీకి ఫోన్ చేయడానికి, ఈ బిల్లు ప్రవేశపెట్టకపోవడానికి ఏమైనా సంబంధం ఉన్నదా? ఈ ప్రశ్నలకు జవాబులు రావాల్సి ఉన్నది. నిజానికి సమస్య బిల్లులు ఆమోదింపచేయకపోవడం కాదు, ఆ బిల్లులు ఆమోదింపచేసేందుకు ప్రజాస్వామికంగా ప్రయత్నాలు చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడమే. సమస్యలపై ఆందోళనను వ్యక్తం చేసిన వారిని తూష్ణీకరించడమే కొత్త సమస్యలకు దారితీస్తోంది. మోదీ వ్యవహారశైలి ఆయన సహజ స్వభావమే కావచ్చు కాని ఆ స్వభావం అన్ని వేళలా విజయం సాధించబోదని మారుతున్న కాలం చెబుతోంది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజులు వెసులుబాటు కల్పించాల్సిందే





**-ఎస్బిఐ మెయిన్ శాఖ కార్యాలయం ముందు బ్యాంకు ఉద్యోగులు నిరసన**
**-ఖాతాదారులకు సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకం**
**-మా ఉద్యోగులందరికీ ఐదు రోజులపాటు వెసులుబాటు కల్పించే విధంగా చొరవ తీసుకోవాలి**

ఆత్మకూరు ఆగస్టు 12 వార్త సాక్ష్యం

ప్రభుత్వ రంగ బ్యాంకు సేవలు విస్తృతంగా ఖాతాదారులకు అందిస్తున్న నేపథ్యంలో రిజర్వు బ్యాంకు ప్రకటించిన కొన్ని జీవోలను తక్షణమే ఉద్యోగులకు అనుగుణంగా ఉండే విధంగా చొరవ తీసుకోవాలని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు బుధవారం ఆత్మకూరు పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ముందుగా ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ శాఖ చీఫ్ మేనేజర్ అప్పాజీ, సాంబశివ, శ్రీహరి, యేసుదానం, జిలాని, ఇస్మాయిల్, నవీన్, నాగార్జున ల ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగుల హక్కుల సాధనకై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ఉద్యోగులపై అధిక ఒత్తిడి పెంచుతూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు సెలవు రోజుల్లో ఎలాంటి పని భారం లేకుండా బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజులు వెసులుబాటు కల్పించే విధంగా రిజర్వు బ్యాంకు ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులందరూ కలిస ి కట్టుగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్, ఉద్యోగులతో పాటు, ఎస్బిఐ -2 బ్రాంచి ఉద్యోగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ హక్కుల సాధనకై నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉన్నతాధి కారులకు హెచ్చరికలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్బిఐ బ్యాంకు ఉద్యోగులు, సాధిక్, యూసుఫ్, అశోక్, కిరణ్, నాగలక్ష్మి, కవిత, చైతన్య కుమార్, నూర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనకు సంబంధించి పోలీసుల అనుమతులపై స్పష్టం

**-ములాఖాత్ కోసం మాత్రమే అనుమతి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు, ప్రజా సమావేశాలకు అనుమతి లేదు**
**-నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరణ్ ఐపీఎస్**

నంద్యాల ఆగస్టు 12 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు కర్నూలు జిల్లా పర్యటనకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ అనుమతులపై స్పష్టత ఇచ్చారు.జైలులో ఉన్న వ్యక్తిని సంబంధిత జైలు అధికారుల నిబంధనల ప్రకారం ములాఖాత్ ద్వారా పరామర్శించి తిరిగి వెళ్లేందుకు మాత్రమే పోలీసు అనుమతి వర్తిస్తుంది.ఓర్వకల్లు విమానా శ్రయం నుంచి కర్నూలు జిల్లా జైలుకు ములాఖాత్ కు వెళ్ళేందుకు సంబంధిత అధికారుల నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేసిన తరుణంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు కర్నూలు జిల్లా పోలీసులు కల్పిస్తారని తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నంద్యాల జిల్లా నుండి కర్నూలుకు వెళ్ళి పోలీసుల అనుమతిలేని బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడే కార్యకమాలలో పాల్గొని ఇబ్బంది పడకూడదని నంద్యాల జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేశారు ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు పోలీసు శాఖ విధించిన నిబంధ నలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కోరడమైనది. పర్యటన సందర్భంగా పోలీసు శాఖ విధించిన షరతులు లేదా చట్టబద్ధమైన నిబంధనలను ఎవరైనా, ఉల్లంఘించి



నట్లయితే, సంబంధిత చట్టా ప్రకారం చర్యలు తీసుకోక తప్పదని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ మీడియా సమక్షంలో స్పష్టం చేశారు.

# ఎల్బీనగర్ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య కార్యాలయం వద్ద కుటుంబీకుల ఆందోళన

వార్త సాక్ష్యం (ఆగస్టు 12) :

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విషాద ఘటన కలకలం రేపింది. విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడటంతో పోలీసు శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడిని 2024 బ్యాచ్‌కు చెందిన జె. సాయి కుమార్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే, ఈ-కాప్స్ విధుల్లో భాగంగా ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ అయి పనిచేస్తున్న సాయి కుమార్, బుధవారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల ప్రాంతంలో కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో బలవన్మ రణానికి పాల్పడ్డారు. విషయం గమనించిన తోటి సిబ్బంది వెంటనే ఆయనను సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి






తరలించారు. కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్న సాయి కుమార్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఏసీపీ కార్యాలయం వద్దకు చేరుకుని, తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో వారు కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేసినట్టు సమాచారం. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఏసీపీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో అదనపు పోలీసు బలగాలు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. కానిస్టేబుల్ సాయి కుమార్ ఈ నిర్ణయా నికి దారితీసిన కారణాలు ఇంకా స్పష్టం కాలేదు. వ్యక్తిగత కారణాలే ఇందుకు కారణం కావొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# భార్యపై అనుమానంతో దారుణం- కొట్టిచంపిన భర్త

వార్త సాక్ష్యం, (ఆగస్టు 12) :

కుటుంబ కలహాలు, భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో భార్యపై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేసిన ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కిలగనూర్ మండలం సలకలపూర్‌కు చెందిన మాధవి (37)కి 18 ఏళ్ల క్రితం కాట్రావత్ రాజు (44)తో వివాహ మైంది. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. దాదాపు 15 ఏళ్లుగా కుటుంబం ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటోంది. గత మూడేళ్లుగా రాజు మద్యానికి బానిసై భార్య మాధవిని అనుమానిస్తూ తరచూ వేధించేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి మరోసారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. మద్యం మత్తులో ఉన్న రాజు.. మాధవి ఛాతీపై సిమెంట్ ఇటుకతో బలంగా దాడి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మాధవి అక్కడికక్కడే స్పృహ కోల్పో యింది. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆమెను ఆసుప త్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమా చారం అందుకున్న ఘట్‌కేసర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు



సేకరించారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాట్రావత్ రాజుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారా? అనే వివరాలను పోలీసులు వెల్లడిం చాల్సి ఉంది. కుటుంబ కలహాలు, మద్యం వ్యసనం, అనుమానాలు ఈ దారుణానికి కారణమైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.

## స్వతంత్ర దినోత్సవం సందర్భంగా గుమ్మడాపురం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ



కొత్తపల్లి ఆగస్టు 12 వార్త సాక్షం

స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో భాగంగా బుధవారం మారుమూల గ్రామమైన పెద్ద గుమ్మడాపురం విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ చేయడం జరిగినది. ఈ ర్యాలీలో తహసీల్దార్ శ్రీమతి ఉమారాణి ఎమ్. పి. డి. ఓ శ్రీమతి మేరి గోకవరం క్లస్టర్ హై స్కూల్ హెడ్మాస్టర్ సుబ్బరాయుడు మరియు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది,ఎమ్. ఆర్. సి సిబ్బంది పాల్గొనడం జరిగినది. ప్రజలు కూడా పాల్గొనడం జరిగినది. రేపటి నుండి ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో ఉండాలని సందేశాన్ని అందరితో ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొత్తపల్లిలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు



కొత్తపల్లి ఆగస్టు 12 వార్త సాక్షం

గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు జ్ఞానానికి మూలం అని మండల విద్యాశాఖ అధికారి 2 ఇనాయ తుల్లా ఐసిడిఎస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి శిక్షణ రెండవ రోజు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు జ్ఞానానికి మూలం అన్నారు. గ్రామాలలో ఉన్న అంగన్వాడి కార్యకర్తలకు డిఆర్పిల ద్వారా పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ శిక్షణ వల్ల అంగన్వాడి కేంద్రంలోని ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరిలో జరిగే శారీరక, మానసిక, మేధావి వృద్ధి, సామాజిక భావోద్వేగా అభివృద్ధి, సౌందర్యాత్మక సాంస్కృతిక అభివృద్ధిలో లోపాలను గుర్తించి, అభివృద్ధికి ప్రణాళికలు వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను టీచర్లు పాటించే విధంగా చూసుకోవాలి అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నపిల్లలు మొదలుకొని ఆరు సంవత్సరాల లోపు పిల్లల వరకు అంగన్వాడి కేంద్రాల్లో ఉండే విధంగా చూసుకోవాలి అన్నారు. సిబ్బంది రోజు పిల్లలకు బొమ్మలతో పాటు ఆటపాటలతో విద్యకు స్వాగతం పలికే విధంగా విద్య అందించాలి అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్పిలు అబ్రహం, శివశంకర్, రామకృష్ణ, రషీద్ హుస్సేన్, మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొట్టాల చెరువు గ్రామంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు

**-కొట్టాల చెరువు ప్రాథమిక వైద్యాధికారి గోపాల్ నాయక్**




ఆత్మకూరు ఆగస్టు 12 వార్త సాక్ష్యం

కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులలో నెలకొన్న వ్యాధి వ్యాధి లక్షణాలపై పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు తగిన మందులు అందజేశారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వి సరోజ ఆరోగ్య కార్యకర్తలు సామక్క ,మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# కారంపూడి ఎస్సై సస్పెన్షన్ ఎత్తివేత

కారంపూడి



కారంపూడి ఎస్సై వాసుపై విధించిన సస్పెన్షన్‌ను ఉన్నతాధికారులు ఎత్తివేశారు. మండలంలో మహిళ ఆత్మహత్యా యత్నం ఘటన నేపథ్యంలో ఎస్సై వాసును సస్పెండ్ చేస్తూ గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు.మిర్చి వ్యాపారంలో ఆర్థిక నష్టం ఎదుర్కొన్న ఓ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన నేపథ్యంలో తనకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ అతని భార్య పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఎస్సై వాసును సస్పెండ్ చేశారు.తాజాగా మంగళవారం విచారణ అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎస్సై వాసుపై వచ్చిన పలు ఆరోపణల్లో వాస్తవం లేదని విచారణలో తేలినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిజమైన మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# త్రివర్ణ పతాకంతో మానవహారం

బాపట్ల



80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో మానవ హారం నిర్వహించారు. నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ జెండా ఊపి త్రివర్ణ పతాక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన నినాదాలు చేస్తూ జాతీయ జెండాను ప్రదర్శించారు.ఈ సందర్భంగా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చైర్మన్, శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 100 మీటర్ల త్రివర్ణ పతాక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో స్వాతంత్ర్య దినోత్సవం, జాతీయ జెండా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ డైరెక్టర్లు గురజాల శ్రీనివాసరావు, పొందుగల ప్రసాదరావు, ఇంకొల్లు పోలీసులు, ఉప్పె నరసింహారావు, ఆర్టీఐ ప్రతినిధి నాగప్రసాద్, వీరాస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, కే. శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి లభ్యత లేనందున వరి సాగు చేయవద్దు

నరసరావుపేట ఆగస్టు 12 వార్త సాక్ష్యం





జిల్లాలో నెలకొన్న వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావ పరిస్థితులు, నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా సాగునీటి విడుదలకు అవకాశం లేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు చేపట్టవద్దని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు. అందుబాటులో ఉన్న పరిమిత నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఖరీఫ్ 2026 పంటల పరిస్థితి, వర్షపాతం లోటు, నీటి లభ్యత, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే కార్యాచరణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 270.75 మి.మీ. కాగా ఇప్పటివరకు 162.52 మి.మీ. మాత్రమే నమోదై 39.97 శాతం లోటు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో సాధారణ పంట విస్తీర్ణం 1,57,932 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 39,758 హెక్టార్లలో సాగు చేపట్టినట్లు వివరించారు. నీటి లభ్యతపై స్పష్టత లేని పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి మధ్యలో నీటి కొరత ఏర్పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వరికి బదులుగా మొక్కజొన్న, కంది, మినుము, పెసర, సజ్జ, కొర్ర, వరిగ, ఆముదం, కూరగాయలు, గడ్డి జొన్న వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి, సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, రైతులకు కరపత్రాల ద్వారా ప్రస్తుత నీటి పరిస్థితి, వరి సాగు వల్ల కలిగే ఇబ్బందులు, ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం కోసం చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో నీటి గుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. "నీరు ఉన్నప్పుడే వరి.. నీరు లేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలే రైతుకు రక్షణ" అనే సందేశాన్ని రైతుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

# ఎఐఎస్ఎ - సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ నుంచి ఏ.నాగరాజు జె. పెద్దయ్య తొలగింపు

-ఎఐఎస్ఎ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు మానుకోవాలి
-ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు గారి నాగార్జున

కర్నూలు ఆగస్టు 12 వార్త సాక్ష్యం




కర్నూలు మీడియా పాయింట్ వద్ద ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్- ఐసా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయా రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున, కర్నూలు జిల్లా కన్వీనర్ సాయి పవన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం, ప్రైవేటీకరణ--కాషాయీకరణకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ - ఐసా (ఐసా ) పేరును పోలిన 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ యాక్షన్ (ఐసా )' పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తూ విద్యార్థులు, ప్రజలను గందరగోళానికి గురిచేయడం, అసలైన ఐసా ప్రతిష్టను దెబ్బతీసే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు..ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఐసా) --సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ సంస్థాగత నిర్ణయాల మేరకు పార్టీ, ఐసా క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగా కర్నూలు జిల్లా నాయకులు ఎ . నాగరాజును సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ బాధ్యతలు, సభ్యత్వం నుంచి, పెద్దయ్యను ఐసా బాధ్యతలు, సభ్యత్వం నుంచి తొలగించడం జరిగిందని తెలిపారు. ఇకపై ఎ . నాగరాజుకు ఐసా తో గానీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీతో గానీ, పెద్దయ్యకు ఐసా తో గానీ ఎటువంటి అధికారిక సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఐసా పేరు, జెండా, గుర్తింపు, సంస్థ ప్రతిష్టను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగి ంచుకునే ప్రయత్నాలను ఇకపై ఉపేక్షించబోమని హెచ్చరించారు.పార్టీ మరియు ఐసా కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు అసలైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ పేరుతో వచ్చే అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు..'ఆల్ ఇండియా స్టూడెంట్స్ యాక్షన్ (ఐసా )'కు అసలైన సిసలైన 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్-ఐసాతో ఎటువంటి సంబంధం లేదు. విద్యార్థి ఉద్యమాన్ని బలహీనపరిచే కుట్రలను తిప్పికొట్టి, ఐసా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని విద్యార్థులు, విద్యాసంస్థలు, మేధావులు ఈ విషయాన్ని గమనించాలని ఐసా పేరును అడ్డం పెట్టుకుని విద్యార్థి ఉద్యమాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోవడం, ఆర్థిక వసూళ్లకు పాల్పడటం, విద్యార్థులు--ప్రజల్లో గందరగోళం సృష్టించడం ఇకపై సహించేది లేదు. ఐసా పేరు, గుర్తింపు, ప్రతిష్టను దుర్వినియోగం చేసే ప్రతి ప్రయత్నాన్ని రాజకీయంగా, సంస్థాగతంగా గట్టిగా ఎదుర్కొనీ విద్యార్థుల హక్కుల కోసం పోరాడే ఉద్యమాన్ని ఎవరి స్వార్థ ప్రయోజనాలకూ బలికానివ్వబోమని స్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో ఐసా నాయకులు సూర్య, వినోద్, సాయి, చైతు తదితరులు పాల్గొన్నారు

# నంద్యాల జిల్లానుకరువు జిల్లాగా ప్రకటించాలి





-నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి
-సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు

నందికొట్కూరు ఆగస్టు 12 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకు పోయారని చేతికి వచ్చిన మొక్కజొన్న పంట పశువుల మేతకు ఉపయోగపడుతుందని రైతాంగం అయోమయ పరిస్థితిలో ఉన్నారని తక్షణమే నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం. రమేష్ బాబు డిమాండ్ చేశారు.. బుధవారం తాటిపాడు గ్రామానికి విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి నాయకుడు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల అనేక పంటలు నాశనం అయ్యాయని వర్షాలు కురువక పెట్టిన పెట్టుబడి రాక రైతులు కోట్ల రూపాయల నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు. కనీసం విత్తనాలు కొనుగోలు చేసేందుకు కూడా డబ్బు లేని పరిస్థితి ఉందని, గ్రామాల్లో పనులు లేని పరిస్థితి ఉందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా విత్తనాలు అందుబాటులో ఉంచాలని వారు కోరారు. ఒకపక్క రైతులు తీవ్రంగా నష్టపోతుంటే మరోపక్క ఫర్టిలైజర్స్ యాజమాన్యం ధనార్జన ధ్యేయంగా అధిక రెట్లకు మందులు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే విజిలెన్స్ చే దాడులు జరపాలని ముందస్తుగా సరైన సమాచారం రైతులకు చేరవేసి పంటలపై అవగాహన కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మక్బూల్ బాషా సలీం నాగన్న షేక్షావలి తదితరులు పాల్గొన్నారు

# మెరీబా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఐ.ఈ.సి ప్రచార ప్రారంభోత్సవం







-ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ

ఆత్మకూరు ఆగస్టు 12 వార్త సాక్ష్యం

ఆత్మకూరు మిరీబా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐ.ఈ.సి ఇన్ఫర్మేషన్ , ఎడ్యుకేషన్ , కమ్యూనికేషన్ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కె. వెంకట శివ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమాజంలో దీర్ఘకాలిక మార్పుకు, ప్రజా ఆరోగ్యం మరియు సామాజిక అంశాలపై అవగాహనకు 'ఐ.ఈ.సి' ప్రచార కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఈ అవగాహన కార్యక్రమాలను ఉపయోగి ంచుకుని సమాజ శ్రేయస్సుకు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. మెరీబా సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన అభినం దించారు. ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, వ్యాధుల నివారణ మరియు ఆరోగ్యకరమైన జీవన శైలిపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి ఐ.ఈ.సి ప్రచారం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరిం చారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండా లని, కళాశాల స్థాయి విద్యార్థులు ఇటువంటి ప్రచార కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని చుట్టుపక్కల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మేరీబా సంస్థ మేనేజర్ జుల్ఫికర్ , సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాప కులు, ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మావతి మహమ్మద్,ఎస్. జె. రవి ప్రకాష్ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులతో కలెక్టర్ సైకిల్ ర్యాలీ

బాపట్ల ఆగస్టు 12 వార్త సాక్ష్యం



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. పురపాలక ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పెదనందిపాడు ఫ్లైఓవర్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. పురపాలక కమిషనర్ ఎం. హాసిని పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అంబేద్కర్ విగ్రహం వద్ద కలెక్టర్ విద్యార్థులతో స్వాతంత్ర్య దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. భారత సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుతూ వికసిత్ భారత్--2047, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 13న రేపల్లెలో, ఆగస్టు 14న చీరాలలో సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరికుమార్, డీఈఓ శ్రీనివాస్ సింగ్, తహసీల్దార్ సలీమా, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# భూ కబ్జాలు, దందాలపై సమగ్ర విచారణ జరపాలి

**-సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్**

కట్టంగూర్, ఆగస్టు 12 వార్త సాక్ష్యం

మండల కేంద్రమైన కట్టంగూర్ లోని సర్వే నంబర్ 482లో జరిగిన భూకబ్జాపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు మిల్లు యజమాని దందాలపై విచారణ జరిపించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వివాదాస్పదంగా మారిన సర్వేనెంబర్ 482లో గల మిల్లు స్థలాన్ని పార్టీ బృందం ఆధ్వర్యంలో సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఆంధ్ర సెటిలర్ సుబ్బారావు గత కొన్నేళ్లుగా పాల్పడ్డ భూ కబ్జాలు, దందాలు, అక్రమాలపై అధికారులు న్యాయ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే నెంబర్ 481 లో పట్టా రిజిస్ట్రేషన్ చేయించుకుని 482 గవర్నమెంట్ భూమిని కబ్జా చేసినాడని, 481 అప్పటికే లేఅవుట్ చేసి ప్లాట్లు చేసి అమ్ముకోవడం జరిగిందని,మరి అదనంగా ఎకరం భూమి ఎక్కడ నుండి వచ్చిందని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 482 స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. పక్కనే ఇంటి స్థలాలు లేని దళితులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారికీ ఆస్థలంలో పక్కా ఇండ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు కబ్జా స్థలాన్ని కంటి తుడుపు చర్యగా ప్రహరీ గోడను కూల్చారని, పూర్తిగా విచారించి, గుర్తించి, స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూమిని భూస్వాములు, దళారులు కొనడానికి, అమ్మడానికి అవకాశం లేదని, అలాంటప్పుడు ఆస్థలం సుబ్బారావు పేరున ఎలా రిజిస్టర్ అయిందని ప్రశ్నించారు. సుబ్బారావు భూ ఆక్రమణలే కాక ఇటుక బట్టీలను కూడ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. అందులో పనిచేస్తున్న స్థానిక, వలస కూలీలతో వెట్టి చాకిరీ చేయిస్తూ, శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నాడని అన్నారు. శ్రామికుల పిల్లలకు సరైన చదువు, పౌష్టిక ఆహారం అందించకుండా వారి జీవితాలతో ఆడుకుం టున్నాడని మండిపడ్డారు. ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కూలిలు అనారోగ్యాలకు గురై సరైన వైద్యం అందక చనిపోతే కూడ వారి సొంత ప్రాంతాలకు పంపకుండా ఇక్కడే ఖాననం చేసిన ఘటనలున్నాయని అన్నారు. ఈ విషయాలన్నింటిపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (యం-యల్) న్యూడె మోక్రసీ జి డివిజన్ కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా నాయకులు గజ్జి రవి, పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి పోలె పవన్, గ్రామ ప్రజలు రవీందర్, మల్లయ్య, శంకర్, ప్రభు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు

బాపట్ల ఆగస్టు 12 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తోందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు తెలిపారు.బాపట్ల పట్టణంలోని 17వ వార్డులో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముంద ంజలో నిలపడమే తన లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్ర మంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అభివృద్ధి బాటలో వెల్లటూరు

భట్టిప్రోలు ఆగస్టు 12 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో వెల్లటూరు గ్రామానికి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భారీగా నిధులు అందించిందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. 'రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసు కున్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్‌టీఆర్ భరోసా తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని MyTDP యాప్‌లో నమోదు చేశారు. వెల్లటూరు గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.12.07 కోట్ల ప్రయోజనాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. 32 మంది లబ్ధిదారులకు జవీ=ఖీ ద్వారా రూ.20.11 లక్షల వైద్య సహాయం అందించామన్నారు. గ్రామ అభివృద్ధికి రూ.5.71 కోట్ల విలువైన పనులు, అనుమతులు, ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో జజ రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడ, పౌల్ట్రీ అభివృద్ధి, కస్టమ్ హైరింగ్ సెంటర్, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులు ఉన్నాయని వివరించారు. గౌడపాలెంలో రూ.9 లక్షలతో నిర్మించిన అశ్వద్ నారాయణ--మహాలక్ష్మి కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్ర తినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్మశాన స్థలాలు కేటాయించాలి

బాపట్ల ఆగస్టు 12 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లాలో స్మశాన స్థలాలు లేని దళితవాడలకు వెంటనే స్థలాలు కేటాయించి, దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి. రమాదేవి డిమాండ్ చేశారు. ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. బాపట్లలో ప్రజా సంఘాల జిల్లా కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీపీఎం నిర్వహించిన సర్వేలో జిల్లాలోని 50 గ్రామాల్లో సుమారు 30 గ్రామాల్లో దళితులకు స్మశాన వాటికల సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. అనేక దళితవాడల్లో తాగునీరు, రహదారులు, ఇళ్ల స్థలాలు, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందన్నారు. దళితులపై వివక్షను అరికట్టేం దుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది కృష్ణానది వరదలు, మోంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద దళిత, ప్రజా సంఘాలతో కలిసి ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్. గంగయ్య, నాయకులు టి. కృష్ణమోహన్, ఎన్. బాబురావు, సి.హెచ్. మాణిలాల్ తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా కోమటి నరసింహ

కట్టంగూర్, ఆగస్టు 12 వార్త సాక్ష్యం



బీజేపీజిల్లా ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు కోమటి నరసింహ నియమితులయ్యారు. ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, ఇతర సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోమటి నరసింహ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఓబీసీ మోర్చాను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## పెన్షన్ దరఖాస్తులను పంచాయతీ కార్యాలయాల్లో ఇవ్వాలి

**-ఎంపీడీవో గంట అంజన్ రెడ్డి**



కట్టంగూర్,ఆగస్టు 12 వార్త సాక్ష్యం

నూతన పెన్షన్ ల మంజూరి కోసం దరఖాస్తు చేసుకునేవారు విధిగా ప్రభుత్వం నిర్దేశించిన దరఖాస్తు పత్రాలను నింపి ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మాత్రమే అందించాలని మండల అభివృద్ధి అధికారి గంట అంజన్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చేయూత పథకం కింద నూతన పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు నూతన పెన్షన్ మంజూరీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు పత్రాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దరఖాస్తుదారులు విధిగా తాము సమర్పించే దరఖాస్తు ఫారం పై సంతకం చేయాలని స్పష్టం చేశారు. అందుకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను జత చేసి మాత్రమే సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందించాలని సూచించారు. కొత్త పెన్షన్ కోసం విధిగా దరఖాస్తు అందించాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసినప్పటికీ నూతన ఫారం లో తప్పకుండా దరఖాస్తు అందించాలని స్పష్టం చేశారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు పత్రాలను స్వీకరించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## కృష్ణవేణికి నివాళులు అర్పించిన మాజీ సైనికులు



కర్లపాలెంఆగస్టు 12 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలం గణపవరం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు దిండి నాగలక్ష్మి సుబ్బారావు గారి అత్త స్వర్గీయ శ్రీమతి దిండి కృష్ణవేణి గారి పెద్దకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు హాజరై కృష్ణవేణి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగలక్ష్మి సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, మండల వైసీపీ అధ్యక్షులు ఎల్లవుల ఏడుకొండలు, చింతాయపాలెం ఎంపీటీసీ సభ్యులు రాతంశెట్టి లక్ష్మణ్, ప్రముఖ వ్యాపారవేత్త పేరాల సురేష్, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, మందపాటి పరమానందకుమార్, స్వామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సామ్యేలు (అమోస్) తదితరులు పాల్గొని కృష్ణవేణికి నివాళులర్పించారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 13 ఆగష్టు 2026

# బిజినెస్

## టాటా సన్స్ తదుపరి ఛైర్మన్ ఎవరు? ఎంపిక ఇలా ఉంటుంది!

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత తిరిగి ఆ బాధ్యతలను చేపట్టబోనని బుధవారం నాడు స్పష్టం చేశారు. ఆయన పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియనుంది. ఈ ప్రకటనతో టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీకి నూతన సారథిని ఎంపిక చేసే ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.నూతన వారసుడికి బాధ్యతల అప్పగింత ప్రక్రియ సజావుగా సాగేలా ఎంపిక ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని చంద్రశేఖరన్ బోర్డును కోరారు. కాగా, గత ఫిబ్రవరిలో ఆయనకు మరో ఐదేళ్ల పాటు పదవీ కాలాన్ని పొడిగించే ప్రతిపాదనకు బోర్డులో పూర్తిస్థాయి మద్దతు లభించకపోవడంతో గత కొద్ది నెలలుగా అనిశ్చితి నెలకొంది. తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయంతో ఆ సందిగ్ధతకు తెరపడింది. సాధారణ కార్పొరేట్ నియామకాలకు భిన్నంగా టాటా సన్స్ ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ప్రత్యేక నిబంధనల మేరకు ఉంటుంది. కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని ఆర్టికల్ 118 ప్రకారం ఈ నియామకం జరుగుతుంది. దీని కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఇందులో టాటా ట్రస్టుల తరపున ముగ్గురు సభ్యులు, టాటా సన్స్ బోర్డు నుంచి ఒకరు, బోర్డు ద్వారా ఎంపికైన మరో స్వతంత్ర వ్యక్తి సభ్యులుగా ఉంటారు.

## హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్ సందడి.. 30,000 చదరపు అడుగుల పెంట్‌హౌస్‌కు రూ.62 కోట్లు!



నగర లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తూ, నగరానికి చెందిన ఓ ప్రముఖ వ్యాపార కుటుంబం ఏకంగా రూ.62 కోట్లు వెచ్చించి 30,000 చదరపు అడుగుల విశాలమైన పెంట్‌హౌస్‌ను సొంతం చేసుకుంది. కొకాపేట్‌లోని గోల్డెన్ మైల్ రోడ్‌లో నిర్మాణమవుతున్న 'ట్రంప్ టవర్స్ హైదరాబాద్' ప్రాజెక్టులో ఇప్పటివరకు జరిగిన అత్యంత భారీ లావాదేవీగా ఇది నిలిచింది.

**-అధికారిక ప్రారంభోత్సవానికి ముందే భారీ డిమాండ్**

ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నప్పటికీ, 16 పెంట్‌హౌస్‌లలో ఇప్పటికే 8 అమ్ముడుపోవడం విశేషం. మొత్తంగా రూ.250 కోట్ల విలువైన పెంట్‌హౌస్‌లు కేవలం రెండు వారాల్లోనే విక్రయమైనట్టు డెవలపర్లు వెల్లడించారు. వీటిలో ఒక్కటి మాత్రమే మయామికి చెందిన ఎన్నారై కొనుగోలు చేయగా, మిగతావన్నీ హైదరాబాద్‌కు చెందిన అత్యధిక నికర విలువ కలిగిన వ్యక్తులే (ఎచ్‌ఎం) దక్కించుకున్నారు. రూ.62 కోట్ల డీల్ విషయానికొస్తే, ఇది ఒకే టవర్‌లోని నాలుగు పెంట్‌హౌస్‌లను కలిపి కొనుగోలు చేసిన ఒప్పందమని, భారతదేశంలోని మొత్తం ట్రంప్ టవర్స్ ప్రాజెక్టుల్లో జరిగిన టాప్-10 అత్యధిక విలువ కలిగిన డీళ్లలో ఇది ఒకటని డెవలపర్లు తెలిపారు.

**-ప్రాజెక్టు విశేషాలు**

నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.2,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ జంట టవర్లు నిర్మాణమవుతున్నాయి. ఒక్కొక్కటి 65 అంతస్తులు, దాదాపు 800 అడుగుల ఎత్తుతో ఇవి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన నివాస సముదాయాలుగా, అలాగే భారత్‌లో అత్యంత ఎత్తైన ట్రంప్-బ్రాండెడ్ టవర్లుగా నిలవనున్నాయి. మొత్తం 454 ఫ్లాట్లు ఉండగా, వీటిలో సాధారణ అపార్ట్‌మెంట్ల ధర రూ.5 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. 2.2 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ప్రాజెక్టు, భారత్‌లో ట్రంప్ బ్రాండ్ మొత్తం రియల్టీ పోర్ట్‌ఫోలియోలో మూడో వంతుకు పైగా వాటా కలిగి ఉంది. దక్షిణ భారత్‌లో ట్రంప్ ఆర్గనైజేషన్ తొలిసారి అడుగుపెడుతున్న ప్రాజెక్టు కూడా ఇదే కావడం విశేషం.

**-ఐదేళ్లలో పూర్తికానున్న నిర్మాణం**

ప్రస్తుతం తవ్వకం, పునాది పనులు జరుగుతున్న ఈ ప్రాజెక్టు వచ్చే ఐదేళ్లలో పూర్తి కానుంది. దీని ద్వారా రూ.3,500 కోట్ల నుంచి రూ.4,200 కోట్ల వరకు అమ్మకాల ఆదాయం వస్తుందని డెవలపర్లు అంచనా వేస్తున్నారు. నోయిడా, గురుగ్రామ్, ముంబై, పుణె, కోల్‌కతా తర్వాత భారత్‌లో ఎనిమిదో ట్రంప్-బ్రాండెడ్ ప్రాజెక్టుగా ఇది నిలవనుంది. హైదరాబాద్ లగ్జరీ రియల్ ఎస్టేట్ ధరలు ఇప్పుడు అమెరికాలోని చికాగో నగర ధరలతో పోటీపడుతున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

## చమురు సెగ.. టాటా షేర్లకు నష్టాలు.. రెండో రోజూ పడిపోయిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లపై ముడి చమురు ధరల ప్రభావం కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు అధిక స్థాయిలో ఉండటం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే అంశంపై స్పష్టత లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహ రించారు. దీనికి టాటా షేర్ల పతనం కూడా తోడవడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిశాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 187.90 పాయింట్లు కోల్పోయి 77,966.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 35.75 పాయింట్లు నష్టపోయి 24,435.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 24,400 స్థాయికి దిగువకు జారడంతో మరింత ఒత్తిడి కనిపించిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 24,250 స్థాయి వరకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేశారు. దేశీయ మార్కెట్‌కు చమురు ధరల పెరుగుదల ప్రతికూలంగా మారుతోంది. భారత్ ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటుంది. ధరలు పెరిగితే ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడంతో పాటు వాణిజ్య లోటు కూడా విస్తరించే అవకాశం ఉంది. టాటా సన్స్ ఛైర్మన్‌గా వైదొలగనున్నట్టు చంద్రశేఖరన్ ప్రకటించడంతో ఆ గ్రూప్ షేర్లు నష్టాలు చవిచూశాయి. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 600 పాయింట్ల వరకు నష్టపోయింది.

## టీమిండియాతో టెస్టుకు ముందు శ్రీలంకకు గట్టి ఎదురుదెబ- కీలక ఆటగాళ్లు ఔట్



భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు శ్రీలంక జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆగస్టు 15న గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ఆ జట్టు కీలక బ్యాటర్లు కుశాల్ మెండిస్, పతుమ్ నిస్సంక గాయాల కారణంగా దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్ ధనంజయ డిసిల్వా సారథ్యంలో 16 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) నేడు ప్రకటించింది. గత నెల 19న కొలంబోలో జరిగిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) మ్యాచ్‌లో పరుగు తీస్తుండగా కుశాల్ మెండిస్ కుడి తొడ కండరాలకు గాయమైంది. అప్పటి నుంచి అతను జాతీయ హై-పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో కోలుకుంటున్నాడు. మరోవైపు మరో ఓపెనర్ పతుమ్ నిస్సంక గత నెలలో లండన్‌లో మణికట్టుకు చేయించుకున్న శస్త్రచికిత్స నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు తొలి టెస్టుకు అందుబాటులో లేకుండా పోయారు. ఈ కీలక ఆటగాళ్ల గైర్హాజరీతో సెలక్టర్లు వెటరన్ వికెట్ కీపర్-బ్యాటర్ నిరోషన్ డిక్వెల్లా వైపు మొగ్గు చూపారు. 2023లో చివరిసారిగా టెస్టు ఆడిన డిక్వెల్లా, 54 టెస్టుల అనుభవంతో మళ్లీ జట్టులోకి వచ్చాడు. భారత్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడిన అంజలా బండార కంటే డిక్వెల్లా అనుభవానికే సెలక్టర్లు ప్రాధాన్యత ఇచ్చారు. ఇదే ప్రాక్టీస్ మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్న ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర సువంతకు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కింది. పేసర్లు కసున్ రజిత, ఇసిత విజేసుందరపై వేటు పడింది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో 66, 63 నాటౌట్ స్కోర్లతో రాణించిన నిషాన్ మధుష్క జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

## ద్రవిడ్ పేరిట చెక్కుచెదరని మూడు రికార్డులు.. క్రికెట్ చరిత్రలోనే ప్రత్యేకం.. సచిన్‌కు కూడా సాధ్యం కాలేదు!



భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా, అసలు సిసలైన టెస్ట్ ప్లేయర్‌గా కీర్తి గడించిన ఆటగాడు రాహుల్ ద్రవిడ్. తన అద్భుతమైన టెక్నిక్, అచంచలమైన మానసిక దృఢత్వం, ఎలాంటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఆడే నైజంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. అభిమానులు ముద్దుగా 'ది వాల్' అని పిలుచుకునే ద్రవిడ్, తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 500కు పైగా మ్యాచ్‌లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో ఇప్పటికీ భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా ఉన్నాడు. అయితే, కేవలం పరుగులు, గణాంకాలకు మించి ద్రవిడ్ భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేశాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో సాధించిన కొన్ని రికార్డులు బ్రేక్ చేయడం దాదాపు అసాధ్యం. అలాంటి మూడు అరుదైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

**-టెస్టుల్లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న ఆటగాడు**

టెస్ట్ క్రికెట్‌లో ఓ బ్యాటర్ ఓపిక, సహనానికి ఇది గొప్ప నిదర్శనం. రాహుల్ ద్రవిడ్ తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 31,258 బంతులను ఎదుర్కొన్నాడు. ప్రత్యర్థి బౌలర్లను అలసిపోయేలా చేయడంలో అతనికి అతనే సాటి. క్రికెట్ చరిత్రలో మరే బ్యాటర్ కూడా ఇన్ని బంతులు ఆడలేదు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న 'గాడ్ ఆఫ్ క్రికెట్' సచిన్ టెండూల్కర్ కూడా 29,437 బంతులతో ద్రవిడ్ వెనుకే నిలిచాడు. ఇది ద్రవిడ్ క్రీజులో ఎంత పట్టుదలగా నిలబడేవాడో స్పష్టం చేస్తుంది.

**-క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు**

అత్యధిక బంతులు ఆడటమే కాదు, క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు కూడా ద్రవిడ్ పేరిటే ఉంది. తన కెరీర్‌లోని 286 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో కలిపి 44,152 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. గంటల తరబడి ఏకాగ్రత కోల్పోకుండా బ్యాటింగ్ చేయడం అతని ప్రత్యేకత. ఈ విషయంలోనూ సచిన్ టెండూల్కర్ (41,304 నిమిషాలు) రెండో స్థానంలోనే ఉన్నాడు. విదేశీ పర్యటనల్లో కఠినమైన పిచ్‌లపై భారత జట్టుకు ద్రవిడ్ అందించిన సేవలకు ఈ గణాంకాలే నిలువుటద్దం.

**-అత్యధిక సెంచరీ భాగస్వామ్యాలు**

క్రికెట్ అనేది ఒక జట్టు క్రీడ అని ద్రవిడ్ పదేపదే నిరూపించాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 88 సార్లు సెంచరీ భాగస్వామ్యాల్లో పాలుపంచుకున్నాడు. ఇది అతని వ్యక్తిగత ప్రతిభకే కాకుండా జట్టుకు వెన్నెముకగా నిలిచిన తీరుకు నిదర్శనం. ఈ జాబితాలోనూ 86 సెంచరీ భాగస్వామ్యాలతో సచిన్ రెండో స్థానంలో ఉన్నాడు. ముఖ్యంగా సచిన్-ద్రవిడ్ జోడీ టెస్టుల్లో 20 సార్లు శతక భాగస్వామ్యాలు నెలకొల్పడం మరో విశేషం.

# స్పోర్ట్స్

## క్రీజ్‌ను వదిలి కామెంటరీ బాక్స్‌లోకి.. రహానే కొత్త అవతారం



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్య రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాడు. ఇన్నాళ్లు బ్యాట్‌తో క్రీజ్‌లో పరుగుల వరద పారించిన రహానే, ఇప్పుడు కామెంటరీ బాక్స్‌లో తన గళం వినిపించడానికి సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌తో అతను వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయనున్నాడు. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ ఫస్ట్-క్లాస్ కెరీర్‌కు ఇటీవలే వీడ్కోలు పలికిన 37 ఏళ్ల రహానే, ఇకపై ఆటను మరో కోణంలో విశ్లేషించనున్నాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రసారమయ్యే ఈ సిరీస్‌కు అతను కామెంటరీ ప్యానెల్‌లో చేరాడు. భారత్ తరపున 85 టెస్టులు ఆడిన రహానే 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో 5,077 పరుగులు సాధించాడు. అతని అపార అనుభవం అభిమానులకు ఆటను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త బాధ్యతపై రహానే స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైనది. ఇన్నాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించాక, ఇప్పుడు ఆటను మరో కోణం నుంచి చూడటం గౌరవంగా ఉంది. నా అనుభవాలను పంచుకుంటూ, ఆటలోని వ్యూహాలను, కీలక క్షణాలను అభిమానులకు వివరిస్తాను" అని తెలిపాడు. రహానే చేరికతో తమ ప్రసారాలకు మరింత బలం చేకూరుతుందని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
గురువారం 13 ఆగస్టు 2026



## ‘కొరియన్ కనకరాజు’ సక్సెస్ మీట్‌లో దర్శకులకు చిరు కీలక సలహా

చిత్ర పరిశ్రమ సుభిక్షంగా ఉండాలంటే దర్శకులందరూ పరిమిత వ్యయంతో (బడ్జెట్‌లోనే) చిత్రాలను రూపొందించాలని మెగాస్టార్ చిరంజీవి ఆకాంక్షించారు. వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన ‘కొరియన్ కనకరాజు’ చిత్రం ఘనవిజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ‘మెగా బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్’కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాత వెచ్చించే ప్రతి రూపాయికి దర్శకుడు బాధ్యత వహించాలని, సినిమా నిర్మాణ వ్యయంపై నియంత్రణ ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సినిమా ఫలితాన్ని బడ్జెట్ నిర్ణయించదని, కేవలం కథాబలమే (కంటెంట్) ప్రధానమని చిరంజీవి స్పష్టం చేశారు. “కథ బలంగా ఉంటే ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్లకు వస్తారు. ఒక సినిమా సాధించే విజయం ఎంతో మంది సినీ కార్మికుల జీవితాల్లో ఆనందాన్ని నింపుతుంది” అని ఆయన పేర్కొన్నారు.




# హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కు నాపై క్రష్ మెసేజ్‌లు చేస్తుంటాడు: మల్లికా శెరావత్



బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న ‘ది ట్రెయిటర్స్ 2’ అనే రియాలిటీ షోలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ షోలో తోటి కంటెస్టెంట్ ఆదిత్య కులశ్రేష్ఠ, “మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? లేక మీపైనే అందరికీ క్రష్ ఉంటుందా?” అని మల్లికాను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. “నాపైనే అందరికీ క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్‌కు కూడా నాపై క్రష్ ఏర్పడింది. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉండుంటే, మేమిద్దరం కలిసి పార్టీ చేసుకున్న వీడియోలను మీకు చూపించేదాన్ని” అని బదులిచ్చారు. టామ్ క్రూజ్ అద్భుతమైన వ్యక్తి అని ఆమె కితాబిచ్చారు. అయితే, ఇవి కేవలం మల్లికా శెరావత్ చేసిన వ్యాఖ్యలు మాత్రమేనని, దీనిపై టామ్ క్రూజ్ లేదా అతని ప్రతినిధుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన గానీ, ధ్రువీకరణ గానీ రాలేదని సమాచారం. ఆగస్టు 13 నుంచి ‘ది ట్రెయిటర్స్ 2’ ప్రముఖ రియాలిటీ షో ‘ది ట్రెయిటర్స్’ మొదటి సీజన్ విజయవంతం కావడంతో, ఇప్పుడు రెండవ సీజన్ రాబోతోంది. కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షో ఈ నెల 13 నుంచి ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా ప్రసారం కానుంది. ఇది ఒక స్ట్రాటజీ ఆధారిత గేమ్ షో. ఇందులో కంటెస్టెంట్లను రహస్యంగా ‘ఫెయిత్‌ఫుల్స్’, ‘ట్రెయిటర్స్’గా విభజిస్తారు. మోసం, వ్యూహాలు, పొత్తుల ద్వారా చివరికి విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్‌లో మల్లికా శెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, దలీప్ తాహిల్, అభిషేక్ మల్హాన్ వంటి పలు రంగాలకు చెందిన ప్రముఖులు కంటెస్టెంట్లుగా పాల్గొంటున్నారు. మొత్తం మీద షో ప్రసారం కాకముందే మల్లికా వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా దీనిపై ఆసక్తి నెలకొంది.



# గోవిందా పక్కన మెరిసిన కొత్త తార

# ఎవరీ కోమల్ రాణి స్వర్ణకార్?



ఒకప్పుడు బాలీవుడ్‌ను తన డ్యాన్స్, కామెడీతో ఏలిన ‘హీరో నంబర్ 1’ గోవిందా... దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై మెరవడానికి సిద్ధమవుతున్నాడు. ఈ పునరాగమనం కంటే ఎక్కువగా, ఆయన పక్కన కనిపించిన ఓ కొత్త ముఖం ఇప్పుడు బీ–టౌన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబై ఎయిర్‌పోర్ట్‌లో గోవిందాతో కలిసి కనిపించిన ఆ బ్యూటీయే కోమల్ రాణి స్వర్ణకార్. ఆ తర్వాత మొదలైన డేటింగ్ రూమర్లు, గోవిందా భార్య సునీతా అహుజా చేసిన ‘వినాశకాలే విపరీత బుద్ధి’ వంటి ఘాటు వ్యాఖ్యలతో ఆమె రాత్రికి రాత్రే దేశవ్యాప్తంగా ట్రెండింగ్ పేరుగా మారింది. అసలు ఎవరీ కోమల్ రాణి? ఆమె నేపథ్యం ఏంటి? యూపీ నుంచి బాలీవుడ్ కలల వరకు... ఉత్తరప్రదేశ్ నుంచి ముంబై మహానగరానికి వచ్చిన కోమల్ రాణి స్వర్ణకార్.. మోడలింగ్ రంగం నుంచి నటన వైపు అడుగులు వేస్తున్న నూతన నటి. బాలీవుడ్ కాన్వాస్‌పై తనకంటూ ఓ స్థానం సంపాదించుకోవాలని కలలు కంటోంది. ఆమె వ్యక్తిగత, విద్యా వివరాలు పెద్దగా బయటకు రానప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం చురుగ్గా ఉంటూ మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సంప్రదాయ చీరకట్టు నుంచి ఆధునిక వెస్ట్రన్ దుస్తుల వరకు విభిన్నమైన లుక్స్‌తో ఆకట్టుకుంటుంది. తన ప్రొఫైల్‌లో తాను శ్రీరాముడి భక్తురాలినని పేర్కొనడం ద్వారా తన ఆధ్యాత్మిక భావాలను కూడా పంచుకుంది. తిరిగిరాని అవకాశంతో సినీ ప్రస్థానం ఏళ్ల విరామం తర్వాత 62 ఏళ్ల గోవిందా కేవలం హీరోగానే కాకుండా, నిర్మాతగా కూడా మారి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం ‘రూపా’. ఈ సినిమాలో కథానాయికగా నటించే సువర్ణావకాశాన్ని కోమల్ రాణి దక్కించుకుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కేవలం ఈ ఒక్క సినిమాకే ఆమె పరిమితం కాలేదు. గోవిందా నిర్మిస్తున్న తదుపరి చిత్రం ‘దునియాదారీ’లో కూడా ఆయనే హీరోగా, కోమలే హీరోయిన్‌గా నటించనున్నారనే వార్తలు బాలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఒక స్టార్ హీరో సరసన, అదీ ఆయన కమ్‌బ్యాక్ ప్రాజెక్టుల్లో ఏకంగా రెండు బ్యాక్–టు–బ్యాక్ అవకాశాలు దక్కించుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



## త్రిషను డిప్యూటీ సీఎం ఎప్పుడు చేస్తారు?.. సీఎం విజయ్‌పై ఏఐఏడీఎంకే నేత సెటైర్

తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్, ప్రముఖ నటి త్రిష కృష్ణన్‌ను ముడిపెడుతూ మరో రాజకీయ వివాదం చెలరేగింది. విజయ్‌తో అనేక చిత్రాలలో నటించిన త్రిషను ఎప్పుడు ఉప ముఖ్యమంత్రిని చేస్తారంటూ ఏఐఏడీఎంకే నేత, మాజీ మంత్రి ఆర్.బి.ఉదయకుమార్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఉదయకుమార్ మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో ఆయన, టీవీకే ప్రభుత్వం.. ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉన్నవారికే ప్రభుత్వ పదవులు కట్టబెడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా, విజయ్ సినిమాలకు పనిచేసిన నిర్మాతలు, సాంకేతిక సిబ్బందిని ప్రభుత్వంలోని కీలక స్థానాల్లో నియమిస్తున్నారని విమర్శించారు. ఆలయ ట్రస్టీ, న్యూఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, సీఎం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర ఫిల్మ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హెడ్, ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన వారిని ఉదహరించారు. ఈ క్రమంలోనే, త్రిషను ఎప్పుడు డిప్యూటీ సీఎం చేస్తారంటూ ఆయన ఎద్దేవా చేశారు. నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలతో వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై డీఎంకే నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేసి, విచారణ అనంతరం విడుదల చేసిన కొన్ని రోజులకే ఈ కొత్త వివాదం తలెత్తడం గమనార్హం. అయితే, తాను రాష్ట్రానికి కావేరి జలాల గురించి మాత్రమే మాట్లాడానని, తన వ్యాఖ్యలకు ఒకే అర్థం ఉందని అప్పట్లో ఉదయనిధి స్పష్టం చేశారు. ఇప్పుడు ఉదయకుమార్ వ్యాఖ్యలతో త్రిష పేరు మరోసారి తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.